# గలగలా గోదారి

-భైరవయ్య

"ఈవేళ పుష్కలావర్తుడు రాలేదేమిటోయ్" అన్నారు సబ్బయ్య గారు.

"ఏమిటే పప్పిలా తగలడిందీవేళ" అన్నారు అవధానిగారు విసుక్కుంటూ.

"ఆ ప్లీడరుగారింటినుంచైనా పట్టుకొచ్చి నోట్లో పొయ్యవే తల్లీ. దాహంతో ప్రాణం పోయేలాగుంది" అని బతిమాలుకుంది కామయ్యగారి తల్లి, మనవరాల్ని.

ఆ మధ్యాహ్నం చాలా మంది ఇళ్ళల్లో పిల్లలు అన్నాల దగ్గర మారాం చేశారు. మగాళ్ళు అసంతృప్తిగా భోజనాలు ముగించారు. వయసుమళ్ళినవాళ్ళు 'దాహం తీరటంలేదే తల్లీ' అని వాపోయారు.

ఈ వుపద్రవానికంతటికీ కారణం పుష్కలావర్తుడురా అబ్బాయ్.

ఆ వూరో తాలూకా కేంద్రం. ఆ వూరికో మున్సిఫ్ కోర్టు, టెన్నీస్ కోర్టు వున్నాయి. కాటన్ దొర పుణ్యమా అని పారుతున్న కాలవుంది. గవర్నమెంటాసుపత్రి, అందులో ఎల్.ఎమ్.పి. డాక్టరు వున్నారు. డచ్చివాళ్ళ టైములో కట్టిన బిల్డింగులూ వున్నాయి. ఆ బిల్డింగ్‌లో హైస్కూలుంది. ఆ చుట్టుపక్కల స్థాపించిన మొదటి హైస్కూలదే. ఆ స్కూల్లోనే చదువుకుని, స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్నవాళ్ళు చాలామందే వున్నారు. ఆ వూళ్ళో లేనివి కుళాయిలు. కుళాయిలంటే అప్పటికింకా ఎవరికీ తెలియదురా అబ్బాయ్. ఒకటో, అరో తప్ప మిగతా నూతులన్నీ ఉప్పనీటివే. కాలవలో నీళ్ళు పెద్దిళ్ళలో వాళ్ళు తాగరులే. ఎందుకంటే, సమస్తపన్లూ ఆ కాలవ గట్టమ్మటే జరుగుతాయి పొద్దుట లేచిన దగ్గర్నుంచీ. ఊరునానుకుని, నిండుగా గోదావరి పాయ ప్రవహిస్తున్నా, ఆనీరు పానయోగ్యం కాదురా అబ్బాయ్. ఎందుకంటావా- ఆ వూరికి ఏడుమైళ్ళ దూరంలో సముద్రముంది. ఆ సముద్రంలో ఈ గోదావరి పాయ కలుస్తుంది. ఆ కలయిక వల్ల, ఆ లవణుడి సారాన్ని ఈ తల్లి ఒంటబట్టించుకుంది. అందువల్ల, ఆ నీరు నోట్లో బెడితే నాలిక వూడిపోయేటంత వుప్పగా వుండడంతో, నూతిలో నీటితోటే సరిపుచ్చుకునేవారురా అబ్బాయ్ చాలామంది. వంట బ్రాహ్మల్ని పెట్టుకోగల సత్తావున్న వాళ్ళు, లాకుల దగ్గర మంచినీటి చెరువునుంచి నీరు తెప్పించుకునేవారు. జబ్బ పుష్టివుండి, గావంచాతో రోడ్డు మీదికెళ్ళడానికి మొహమాట పడాల్సిన అవసరం లేనివాళ్ళో, లేదా అటువంటి వ్యక్తులు కల కుటుంబం వాళ్ళో, ఆ నీళ్ళు తెచ్చుకునేవారు. మిగతా జనం చప్పటి నూతినీటితోటే అవసరాలు తీర్చుకునేవారురాఅబ్బాయ్.

అలా ఆ వూరి జనం నీటికోసం అంగలారుస్తున్న సమయంలో, పుష్కలావర్తుడు ఆవిర్భవించాడురా అబ్బాయ్.

ఆ వూరి జనాభాలో సగానికి పైగా ప్లీడర్లూ, ఉద్యోగస్థులూను. కచేరీలోనో, స్కూల్లోనో, దొరతనం వారు ప్రవేశపెట్టిన అనేకానేక ఆఫీసుల్లో వాళ్ళకి పని. అందరికీ అవసరమైన తాగే నీరు అందించినవాడురా పుష్కలావర్తుడు. నీటి రుచి తెలియజెప్పినవాడురా. కోడికూయక మునుపే లేచి, అపరాహ్ణం వేళవరకు నీళ్ళు మోసి, ఆర్తులదాహం తీర్చి ఇంటికి జేరి, ఇల్లాలు వుడకేసి బెట్టిన మెతుకులు నాలుగూ కడుపులో పడేసుకుని, ఒకింత విశ్రమించి, తిరిగి జీవుల దాహం తీర్చే కార్యక్రమంలో నిమగ్నుడైపోయేవాడురా అబ్బాయ్, ఆ పుష్కలావర్త బిరుదాంకితుడు.


పుష్కలావర్తుడి అసలు పేరు పుల్లంబొట్లని చాలా మందికి తెలియదురా అబ్బాయ్. ఊరందరికీ పుష్కలావర్తుడన్న పేరే ఎక్కువ తెలుసురా. 'ఏమిటోయ్ పుష్కలావర్తుడూ విశేషాలు' అని పెద్దవాళ్ళంటే,

## పుష్కలావర్తుడు

'పుష్కలావర్తంగారొచ్చారని చెప్పండ్రా' అని నడి వయసువాళ్ళనేవారు. 'నాయనా పుష్కలం' అని ముసలమ్మలు పిలుస్తే, 'పుష్కలయ్యగోరు' అని బీదా బిక్కీ వ్యవహరించేవారు.

లోటా పుచ్చుకుని చిన్న పిల్లలు వెళ్ళినా, బిందెలు పట్టుకుని పెద్దవాళ్ళడిగినా; ఎవరూ, ఏమిటీ, ఏమిచ్చారు అనే ప్రసక్తి లేకుండా ఆ పాత్రలు నింపడమే పుష్కలావర్తుడి లక్ష్యంరా అబ్బాయ్.

ఆ వూరి మంచినీటి ఎద్దడిని తీర్చినవాడని, ఏరసహృదయుడో పెట్టిన పేరే శాశ్వతమయి, సార్థకనామధేయుడయ్యాడురా ఆ పుల్లంభొట్లు.




ఆ పుష్కలావర్తుడి అసలు వూరు రాజోలు దగ్గర పల్లెటూరు. ఒంటికి చదువు అబ్బకపోగా; అతని తండ్రి పోగానే ఉమ్మడాస్తని చెప్పి లేని అప్పులు చూపించి, దాయాదులు వున్నదంతా వూడ్చేసుకున్నారురా అబ్బాయ్. ఉన్నవూర్లో వుండలేక, భార్యని వెంట బెట్టుకుని, వశిష్ఠ గోదావరి దాటి, ఈ వూరొచ్చి పడ్డాడ్రా. వూళ్ళోకి అడుగు పెట్టాక, అలికి ముగ్గులు పెట్టున్న పెద్ద అరుగుల లోగిలి కనిపిస్తే, ఆ లోగిలి గుమ్మం దగ్గర నిలిచిపోయాడ్రా. కొంతదడువుకి బయటికొచ్చిన జరీ అంచు వుత్తరీయానికి సవినయంగా నమస్కరించి, క్లుప్తంగా తన పరిస్థితి వివరించి చెప్పాడు. అంతా విన్నాక, "ఈరోజు కిక్కడ బస చెయ్యవయ్యా పుల్లంభొట్లూ. ఏం చెయ్యాలా అన్నది రేపాలోచించుకుందాం!" అన్నార్రా ఆయన.

"చిత్తం" అన్నాడ్రా పుల్లంభొట్లు.

"స్వహస్తమా, లేక సహపంక్తికొస్తావా?"

"చిత్తం. తమరికిబ్బంది. స్వహస్తమేనండి."

"సరే అయితే. ఆ తూర్పువేపు వసారాగదిలో సర్దుకోండి అందాకా, తరవాత చూద్దాం."

"చిత్తం, చిత్తం" అని ఆ దంపతులిద్దరూ దోసిలొగ్గి మొక్కార్రా.

అలా సూరయ్యగారింట్లో, వారి ఆదరణకి పాత్రుడయ్యాడురా పుల్లంభొట్లు.

పుల్లంభొట్లు జబ్బపుష్టి మనిషిరా అబ్బాయ్. మాగిన మామిడి పండులా వుంటాడు. భారీ విగ్రహమే. ఒంటికి అక్షరమ్ముక్క అంటలేదు. ఆ రోజుల్లో, తాతలు విద్వత్ప్రతిభతో అగ్రహారాలు సంపాయించుకుంటే, ఆ విద్దెల తల్లిని నిర్లక్షించి తండ్రులు బతికారు. కొడుకులు బట్టకట్టేసరికి, అగ్రహారాలు అన్యుల పాలయ్యాయి. చదువు అటకెక్కి కూర్చుంది. ఆ విధంగా అటు విద్యని, ఇటు సంపదనీ రెండింటినీ పొగొట్టుకున్నార్రా నాటి అగ్రహారీకులు. ఆ కోవలో వాడేరా పుల్లంభొట్లు. ఒక్కటే సుగుణంరా అబ్బాయ్. అగ్రహారీకుల అహంకారం మటుకు అబ్బలేదురా. అదే నేడు శ్రీరామ రక్షై నిలిచిందిరా అబ్బాయ్.

ఆ రాత్రి సూరయ్యగారింట్లో గడిచిపోయిందిరా పుల్లంభొట్లుకి.

తెల్లవారిన తర్వాత, ఓ నిర్ణయానికొచ్చిన సూరయ్యగారు, "ఏమయ్యా నువ్వున్న పరిస్థితిలో ఒక మార్గం వుత్తమంగా తోస్తోంది. నీకు సమ్మతమైతే ఆ పని చేద్దువుగాని" అన్నార్రా అబ్బాయ్.

"చిత్తం. తమరెలా చెబితే అలాగేనండి."

"ఈ వూరికి మంచినీటి ఎద్దడి బాగానేవుందయ్యా. మాకు ఫరవాలేదు. ఆ గంగమ్మ తల్లిదయవల్ల, నారికేళ సలిలంలాంటి నీరుపడింది మానూతిలో. మా నుయ్యిలాంటి నూతులు మొత్తం వూరిమీద మూడో, నాలుగో వున్నాయంతే. మిగతా నూతుల్లో నీరు చప్పగానో, కొంచెం వుప్పగానో వుంటుంది. జనం మంచినీటి కోసం తహతహలాడిపోతున్నారయ్యా.

"చిత్తం."

"లాకులదగ్గర మంచి నీటి చెరువుంది. అదిక్కడికి కోసెడు దూరముంటుంది. అక్కడి నుంచి రోజూ నీరు తెచ్చుకోవడమన్నది సాధ్యం కాదయ్యా."

"చిత్తం."

"నువ్వాగనక రోజూ ఆ నీరు తెచ్చిపోస్తివా, తరతరాలుగా నీకీ వూరు ఋణపడి వుంటుంది. ఆ విధంగా నీ భుక్తి గడుస్తుంది. ఏవంటావ్?

"చిత్తం. కానీ జల విక్రయం..."

"దోషమంటావు. కాదయ్యా. దానికి వెల నువ్వు నిర్ణయించటం లేదు.నువ్వు చేసేదల్లా, ఆ నీరు తెచ్చి పొయ్యడమే. అందుకు సంతోషంగా, ఈవూరు నిన్ను సత్కరించుకుంటుంది, ఏవంటావ్, అన్నార్రా సూరయ్యగారు.

"చిత్తం. పెద్దలు మీరు చెప్పినట్టే నడుచుకుంటాను" అన్నాడ్రా పుల్లంభొట్లు.

వెంటనే నాలుగు వీధుల వాళ్ళకి చెప్పడం, వాళ్ళు ఆనందంతో అంగీకరించడం జరిగిపోయిందిరా అబ్బాయ్. సూరయ్యగారు, ఆయన యింట్లోదే శుభ్రమైన ఇత్తడి బిందె తోమించి, పుల్లంభొట్లు భుజంమీద వుంచార్రా. ఆవిధంగా, పుల్లంభొట్లు, ఆవూరికి పుష్కలావర్తుడై పోయాడ్రా అబ్బాయ్.

ఆ రోజు నుంచి పుష్కలావర్తుడి జీవితం ఒక ఒరవడిలో పడిపోయింది. నాలుగో ఝామునే లేచిన మనిషి, రాత్రి దీపాలుపెట్టేవేళ వరకూ బిందెలకొద్దీ నీరు ఆ చెరువులోంచి తెచ్చి వూరి దాహం తీర్చ సాగాడురా అబ్బాయ్. ఒక బిందెకి కానీ చొప్పున ప్రారంభమై, అర్ధణాకి ఆనందంగా పెంచిందిరా ఆ వూరు. అదేగాక, పెరట్లో కాసిన కాయోపండో అతనికివ్వడం రివాజయిపోయింది. పొలాలున్న ప్లీడర్లూ, పెద్దలోగిళ్ళవారూ వీలయినప్పుడల్లా ధాన్యమో పప్పో "పట్టుకెళ్ళవోయ్ పుష్కలావర్తం" అని నవ్వుతూ యివ్వడమూ ఆనవాయితీ అయిపోయింది.

పండుగకో-పబ్బానికో, వ్రతానికో-వుద్యాపనకో పుష్కలావర్తుడి భార్యని పిలిచి బొట్టుపెట్టి తాంబూలమివ్వడమూ నిత్యకృత్యమయిపోయింది.

మొదట ఆసరా యిచ్చిన సూరయ్యగారి అండ కొండలా వుండనే వుందిరా అబ్బాయ్.

అలా నిశ్చింతగా గడిచిపోతున్నాయిరా రోజులు పుష్కలావర్తుడికి.

అతని దినచర్యలో మార్పు లేదురా. బ్రరువ చీది మెరగడురా.నక్కృత్తుగా లంఖణం చెయ్యాల్సొచ్చినా అర పూట మించి వుండేవాడు కాదు.

"అదేవిటోయ్. అంత జ్వరంతో రాకపోతే యేం కొంప మునిగిందీ" అన్నా వినేవాడు కాదు, 'ఇదేం చేస్తుందండీ' అంటూ.

అలా నిండుగా, మంచినీటిసారంలా, రోజులు వెళ్లిపోతున్నాయిరా పుష్కలావర్తుడికి.

ఉదయం ఆరింటికల్లా రమ్మనమని కబురొచ్చిందిరా సూరయ్య దగ్గర్నుంచి. ఉరుకుల మీద వెళ్ళిన పుష్కలావర్తుడికి సూరయ్యగారు, ఇంకా కొందరు ప్లీడర్లు, పెద్దవాళ్ళు కనిపించార్రా. అతని గుండె కొంచెంగా ఝల్లుమందనుకో అబ్బాయ్.

"రావయ్యా రా" అన్నారు సూరయ్యగారు.

బిందె పక్కన అరుగు మీద పెట్టి, నెత్తిన చుట్టుకున్న గావంచా విప్పి భుజం మీద వేసుకుని వెళ్ళాడు పుష్కలావర్తుడు.

సూరయ్యగారి చూపందుకుని, ప్రకాశంగారు చప్పట్లు చరిచారు. మెడలో గంటలు మోగుతుండగా ఒంటెద్దు బండి వచ్చి ఆగిందిరా అబ్బాయ్. అది విచిత్రంగా వుందిరా.

"ఇదిగోనయ్యా. ఇహనుంచి యిది వాడుకో" అన్నార్రా సూరయ్యగారు.

బ్రరువ చిదని పుష్కలావర్తుడు, ఆవాడు సూరయ్యగారి చేతుల్లో మొహం పెట్టుకుని బావురుమన్నాడురా అబ్బాయ్.

అది ఒంటెద్దు బండిరా. వయసులో వున్న ఎద్దు కాడికి కట్టబడుందిరా. వెనక యాభై బిందెలు పట్టే ఇనపరేకులతో చేసిన పెట్టె రంగెయ్యబడి వుందిరా అబ్బాయ్.

"అదేమిటయ్యా చిన్నపిల్లాడిలా. ఏమిస్తేనీ ఋణం తీర్చుకోగలం చెప్పు". అన్నార్రా సూరయ్యగారు, పుష్కలావర్తుడి వీపునిమురుతూ.

అంతేరా అబ్బాయ్. శ్రమకి విలువ నెవడు కట్టగలడురా. ●



STUDY DIRECTLY
B.A, B.Com, M.A.

- ఏ విద్యార్హత అవసరము లేదు.
- ఎంట్రెన్సు పరీక్ష లేదు.
- 25 సం॥లు నిండిన వారు B.A/B.Com చదువుటకు అర్హులు.
- 35 సం॥లు నిండిన వారు M.A చదువుటకు అర్హులు.
- రికగ్నైజ్డ్ డిగ్రీ కనుక పై చదువులకు, ప్రమోషన్లకు, ఉద్యోగములకు ఉపయోగించును.

పూర్తి వివరములు గల ప్రాస్పెక్టస్‌కై రు.5/-లు (M.O) పంపండి.

VIJAYA INSTITUTE OF CORRESPONDENCE COURSES
LALITHA COLONY (DABA GARDEN)
VISAKHAPATNAM-20
RAMANA

వడ్డెర చండీదాస్ రచనలు
మానవ జీవితాన్ని పశుకామం నుంచి దివ్యరాగం వైపు మళ్ళించే రచనలు!

అనుక్షణికం-1 (ఆంధ్ర జ్యోతి సీరియల్) రూ.35/-
అనుక్షణికం-2 (ఆంధ్ర జ్యోతి సీరియల్) రూ.35/-
చీకట్లోంచి చీకట్లోకి (విజయ సీరియల్) రూ.15/-
(స్త్రీని ప్రధాన పాత్రగా తీసుకొని చేసిన అంతరంగ చిత్రణ)
హిమజ్వాల-1 (ఆంధ్ర జ్యోతి సీరియల్) రూ.20/-
హిమజ్వాల-2 (ఆంధ్ర జ్యోతి సీరియల్) రూ.25/-
హిమోహరాగిణి ______ రూ.1/-
(మార్మికంగా తాను సృష్టించిన సప్తరాగ స్వరాక్షర మాలిక)
DESIRE AND LIBERATION __ RS.25/-
(భారతదేశంలో ఈ శతాబ్దంలో వెలువడిన రెండు మూడు నూతన మెటాఫిజిక్ దర్శనాలలో ఒకటి)

నవజ్యోతి పబ్లికేషన్సు
ఏలూరు రోడ్డు, విజయవాడ-2
ఫోన్: 74005